ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025
5
విజయనగరం



పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వారి పట్ల ఎవరైనా అనుచితంగా గాని, అసభ్యంగా గాని ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, క్లాస్ టీచరుకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం గురించి వివరంగా తెలియజేశారు. ఈ విషయంలో బాల బాలికలకు న్యాయవ్యవస్థ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రుల పట్ల, ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు శ్రీదేవి, రామప్పడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు , కెజిబివి ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

బొబ్బిలిలో క్యాంపు రాజకీయాలు

- టిడిపిలోకి 10 మంది వైసిపి కౌన్సిలర్లు!
- సభ్యులను కాపాడుకునేందుకు వైసిపి యత్నం

బొబ్బిలి మున్సిపాలిటీలో రాజకీయాలు వేడెక్కాయి. నిన్న మొన్నటి వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తులు ఒక్కసారిగా భగ్గుమనడం.. వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు టిడిపికి మద్దతివ్వడం.. అంతా కలిసి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావడం.. చకచకా జరిగిపోతున్నాయి. అందులో భాగంగా అసమ్మతి కౌన్సిలర్లను టిడిపి పెద్దలు రహస్య ప్రాంతానికి తరలించారు. ఉన్న కౌన్సిలర్లను కాపాడుకునేందుకు వైసిపి పెద్దలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలో క్యాంపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. వైసిపి చేతిలో ఉన్న మున్సిపల్ చైర్మన్ పదవిని టిడిపికి అప్పగించేందుకు వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని తెరపైకి తెస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలో రాజకీయం వేడెక్కింది. మున్సిపాలిటీలో 31 వార్డులలో 20 చోట్ల వైసిపి విజయం సాధించింది. 10 చోట్ల టిడిపి అభ్యర్థులు, ఒక వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. వైసిపి అత్యధిక స్థానాలను కైవశం చేసుకోవడంతో ఇండిపెండెంట్‌గా విజయం సాధించిన 30వ వార్డు కౌన్సిలర్ వాడపల్లి వనజకుమారి కూడా ఆ పార్టీలో చేరడంతో వైసిపి బలం 21కు పెరిగింది. వైసిపి కౌన్సిలర్ మరిశర్ల రామారావు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండటంతో అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే 20 మంది కౌన్సిలర్లు అవసరం. దీంతో 9మంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, 10 మంది టిడిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకం చేయగా, మరో కౌన్సిలర్ అవసరం ఏర్పడింది. దీంతో మరో ముగ్గురు కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకొనేందుకు టిడిపి పెద్దలు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో తమ కౌన్సిలర్లను కాపాడుకునే ప్రయత్నంలో వైసిపి పెద్దలు ఉన్నారు.

చేజారిపోతున్నారు..

9 మంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు చేజారిపోగా, మరో కౌన్సిలర్ కూడా టిడిపి గూటికి చేరినట్లు తెలిసింది. 10 మంది వైసిపి కౌన్సిలర్లను ప్రత్యేక వాహనంలో టిడిపి నేతలు వేరే చోటికి తరలించి ఉంచినట్లు సమాచారం. ఇప్పటికే 10 మంది కౌన్సిలర్లు టిడిపి చేతిలోకి వెళ్లారు. మిగిలిన వారిలో మరో ముగ్గురిని ఎలాగైనా లాగేందుకు టిడిపి పెద్దలు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయం కాస్తా వైసిపి పెద్దలకు తెలియడంతో మిగిలిన కౌన్సిలర్లు చేజారిపోకుండా వేరే చోటికి తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

నేడో, రేపో కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం

అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్‌కు మంగళ, బుధవారాల్లో ఇవ్వనున్నట్లు తెలిసింది. కోటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై అసమ్మతి వైసిపి కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు సంతకాలు పెట్టినట్లు బోగట్టా. వైసిపి అసమ్మతి కౌన్సిలర్లను రహస్య ప్రాంతానికి తరలించడంతో టిడిపి కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ తీర్మానం అందాక, సంతకాలపై దర్యాప్తు చేసి కౌన్సిలర్లే చేశారా? లేదా నిర్ధారించుకుని, సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అవిశ్వాస తీర్మానం తెరపైకి రావడంతో మున్సిపాలిటీలో రాజకీయం వేడెక్కింది.

రెడ్‌క్రాస్‌లోనే ప్లేట్‌లెట్స్

- కాంపొనెంట్ యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- రక్తదానానికి ముందుకు రావాలని పిలుపు
- రెడ్‌క్రాస్ ద్వారా అందుబాటులో మరిన్ని సేవలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ప్లేట్‌లెట్స్ కాంపొనెంట్ యూనిట్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. బ్లడ్‌బ్యాంకును ఆధునీకరించి, సిఎస్‌ఆర్ నిధులు రూ.76.01 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లేట్‌లెట్స్ యూనిట్‌తో బాటు, ఎస్‌డిపి యూనిట్‌ను కూడా రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్‌ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి సోమవారం ప్రారంభించారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఈ నిధులను రెడ్‌క్రాస్‌కు సమకూర్చింది. రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సేవలను ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా రెడ్‌క్రాస్ విశేషమైన సేవలను అందిస్తోందని కొనియాడారు. అవసరమైన వారికి రక్తాన్ని అందించడంతోపాటు, లైవ్ డోనర్స్‌ను సమకూర్చడం తదితర అనేక రకాల విశిష్ట సేవలను కూడా రెడ్‌క్రాస్ నిర్వర్తిస్తోందని చెప్పారు. కాంపొనెంట్ యూనిట్ ద్వారా ఉమ్మడి జిల్లాలకు పూర్తి రక్తంతో పాటు, ప్యాకెడ్ రెడ్ బ్లడ్‌సెల్స్, ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా, ప్లేట్లెట్స్, క్రయోప్రెసిపిరేట్, సింగల్ డోనర్ ప్లేట్‌లెట్స్ కూడా అందిస్తున్నారని తెలిపారు. రెడ్‌క్రాస్‌లో పనిచేస్తున్న వారు కూడా సేవాగుణంతో తమ విధులను నిర్వర్తిస్తున్నారని అభినందించారు. మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి, జిల్లాలో రక్తం కొరతను నివారించేందుకు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఎండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిప్యూటీ డిటిఒ డాక్టర్ కె.రాణి, సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, కార్యదర్శి కె.సత్యం, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, జిల్లా ప్రతినిధులు డాక్టర్ అశోక్, డాక్టర్ వెంకట్, డాక్టర్ లెంక శ్రీనివాస్, ఖాదర్ వలీబాబా దర్గా పీఠాధిపతి డాక్టర్ ఎండి ఖలీలుల్లా షరీఫ్, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కంది వెంకటరమణ, రెడ్ క్రాస్ ప్రతినిధులు శివకుమార్, బొడ్డేపల్లి రామకష్ణ, సత్యం, రాము, టి.బాలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు.

రెడ్‌క్రాస్ వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్, చిత్రంలో ఎంపి కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ

పౌల్ట్రీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- తొలగించిన కార్మికులందర్నీ విధుల్లోకి తీసుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చట్టాన్ని దిక్కరిస్తున్న వెంకట్రామా పౌల్ట్రీస్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అన్యాయంగా తొలగించిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, స్థానిక యువతకు 75 శాతం ఉపాధి కల్పించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో చీపురుపల్లి తహశీల్దారు కార్యాలయం సమీపంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ మండలంలోని కర్లాం, అలజంగి గ్రామాల సమీపంలో 2011లో వెంకట్రామా పౌల్ట్రీని యాజమాన్యం ఏర్పాటు చేసిందని, పౌల్ట్రీ పెట్టేటప్పుడు స్థానిక యువతకే ఉపాధి కల్పనలో పెద్ద పీట వేస్తామని చెప్పి చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలను యాజమాన్యం నమ్మ బలికిందన్నారు. తీరా పౌల్ట్రీ లాభాలలో నడుస్తున్న సమయంలో స్థానికులను ఒక్కొక్కరిగా తొలగించి స్థానికేతరలను యాజమాన్యం నియమిస్తోం దన్నారు. స్థానికలకు 75 శాతం మేర ఉపాధి కల్పించాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసిందన్నారు. కార్మికులను తొలగించడమే కాకుండా అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను మోసం చేస్తున్న వెంకట్రామా పౌల్ట్రీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్ చేశారు. లేని కంపెనీ ఉన్నట్లు కాగితాలు సృష్టించి 25 మంది కార్మికులను తొలగించామని, తొలగించిన వారిలో ఎవరికైనా పని కావాలంటే చత్తీస్‌ఘడ్‌లో ఉన్న కంపెనీలో పని చేసేందుకు రమ్మని చెప్పడం అన్యాయమని అన్నారు. 4గురు డ్రైవర్లను, ఒక స్కిల్ వర్కర్‌ని అన్యాయంగా తొలగించి చట్టాన్ని దిక్కరిస్తు కార్మికులనే కాకుండా ప్రభుత్వాన్ని, ప్రజలను కూడా యాజమాన్యం మోసం చేస్తోందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకి ఇక్కడ భూములిచ్చింది ప్రజలని, దుమ్మూ ధూళితో పాటు నిరంతరం కాలుష్యం అనుభవిస్తున్న స్థానిక ప్రజలను కాదని స్థానికేతరులను తీసుకొచ్చి పౌల్ట్రీలో పని చేయించుకోవడం తగదన్నారు. యాజమాన్య దుర్మార్గాన్ని ఈ ప్రాంత ప్రజలు, తీవ్రంగా ఖండించాలని సమావేశం ద్వారా కోరారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్మికులకు అండగా నిలవాలని ప్రజలకు, ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, సుదారాణి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా కార్యదర్శుల డిప్యుటేషన్

గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుకు కీలకంగా మారిన గ్రామ సచివాలయ కార్యదర్శుల డిప్యుటేషన్లు ఇష్టారాజ్యంగా మారాయి. ఇలా ఏరికోరి తెప్పించుకుంటున్న నాయకులు చెప్పిందే వేదంగా కార్యదర్శులు నడుచుకుంటున్నారు. ఇలా ఇటు కార్యదర్శులు అటు గ్రామ స్థాయిలో అధికార పార్టీ నాయకులు ఒక్కటి కావడంతో గ్రామాల అభివృద్ధి కుంటుబడుతోంది. భూ సమస్యల పరిష్కారానికి మ్యుటేషన్లు దరఖాస్తు, ఆమోదం మొదలుకుని, హౌసింగ్, ఫించన్ల తనిఖీ, కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ వరకు అన్నీ గ్రామ సచివాలయాల్లోనే జరుగుతున్న విషయం విధితమే. సచివాలయాలకు అడ్మిన్లుగా కార్యదర్శులు వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రతి పౌరసేవ, గ్రామంలోని అభివృద్ధి పనులు కూడా వీరి కనుసన్నల్లో సాగుతున్నాయి. ఈనేపథ్యంలో కార్యదర్శులు తమ గుప్పెట్లో ఉండే విధంగా అధికార పార్టీ నాయకులు జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలో పూర్తి అనుకూలంగా వున్న వారిని డిప్యుటేషన్లపై తెచ్చుకునేందుకు ఎమ్మెల్యేల స్థాయిలో ఒత్తిడి పెంచుకుంటున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

- అధికార పార్టీ ఆడిందే ఆట
- గ్రామాల అభివృద్ధి, పౌరసేవలకు గుదిబండ

గజపతినగరం మండలం పురిటిపెంట కార్యదర్శి పోస్టు ఇందుకు ఉదాహరణ. వాస్తవానికి ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి విశాఖ జిల్లాలో పనిచేసేవారు. రాజకీయ సిఫార్సులతో మన జిల్లాలోని కొత్తవలస మండలంలోని ఓ గ్రామానికి బదిలీ చేయించారు. ఇక్కడి నుంచి డిప్యుటేషన్‌పై పురిటిపెంటకు తెచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో కూటమి ప్రభుత్వానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి చక్రం తిపినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రేడ్ -1 పరిధిలోవున్న ఆయనను గ్రేడ్ -2 పోస్టులో ఉంచడం వెనుక ఇదే కారణమన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. సంబంధిత కార్యదర్శి కేవలం టిడిపి నాయకులను ప్రసన్నం చేసుకోవడం తప్ప, ఇతర పనులను చురుకుగా ముందుకు తీసుకెళ్లడం లేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

వేపాడ మండలం బాణాది గ్రామ సచివాయానికి అదే మండలం జాకేరు కార్యదర్శి ఇన్‌ఛార్జిగా ఉండేవారు. ప్రభుత్వం మారాక అతన్ని తప్పించి బల్లంకి కార్యదర్శిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన టిడిపి నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారంటూ ఇటీవల స్థానిక మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంతకు ముందే పాలకవర్గం నిర్ణయాలు అమలు చేయడం లేదంటూ స్థానిక సర్పంచి యశోద సుమారు రెండు నెలల క్రితమే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రికార్డులు కూడా సచివాలయం నుంచి వేరొక చోటుకు తరలించారని కూడా వీరు విమర్శించారు. ఈ పరిణామాలపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కూడా ఆందోళన, విమర్శలు వ్యక్తం చేసిన సంగతి విధితమే. కేవలం బాణాది, పురిటిపెంటలో మాత్రమే కాదు, జిల్లాలో చాలా సచివాలయాల్లోని కార్యదర్శులను డిప్యుటేషన్లపై ఇటీవల నియమించుకున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకూ తూట్లు

వాస్తవానికి కొద్ది రోజుల క్రితం కార్యదర్శులు అనధికారికంగా ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో వీరిని తక్షణం వెనక్కి పిలిపించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో కేవలం వారం రోజులు మాత్రమే వీరికి డిప్యుటేషన్‌కు అనుమతిచ్చేందుకు నిబంధనలు అవకాశం కల్పిస్తాయి. ప్రస్తుతం కొనసాగుతున్న డిప్యుటేషన్లు మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా జరిగినట్లు గుర్తించారు. చాలా మంది సొంత శాఖలో కాకుండా ఇతర శాఖల్లోనూ విధులు నిర్వహిస్తుండడం వల్ల సచివాలయాల్లో పనులు స్తంభించిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులను అన్ని ప్రాంతాల్లో డిప్యుటేషన్లను రద్దు చేసి, కార్యదర్శులను వెనక్కు పిలిపించాలని ఆదేశాలిచ్చినా.. చాలాచోట్ల అమలు కావడం లేదు. కార్యదర్శులు తమకు నచ్చిన ప్రాంతంలో పనిచేయడం కోసం ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

మత సామరస్యంతోనే శాంతి

రంజాన్ వేడుకల్లో ఎంపి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశ ప్రజల శాంతి సౌభాగ్యాల కోసమే దేశవ్యాప్తంగా ముస్లిములు ప్రార్థనలు చేస్తున్నారని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మత సామరస్యంతోనే శాంతి ఉంటుందన్నారు. రంజాన్ సందర్భంగా తోటపాలెంలోని హుస్సేన్ మసీద్ ఈద్ నమాజ్‌లో ముస్లిములు సోమవారం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారతదేశ లౌకిక తత్వం కూడినదని, కుల,మతాలకు అతీతంగా ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ నమాజ్ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రహీం, షరీఫ్, భాష, వందలాది మంది ముస్లిములు పాల్గొన్నారు.

విజయనగరంలో ముస్లిములతో కలిసి నమాజ్ చేస్తున్న ఎంపి కలిశెట్టి

మసీదుల వద్ద పోలీసు బందోబస్తు

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన రంజాన్ పండగ వేళ మసీదుల వద్ద ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాలతో పోలీసులు సోమవారం బందోబస్తు నిర్వహించారు. జిల్లాలో రంజాన్ పండగ హిందూ - ముస్లిం సోదరుల మధ్య సోదర భావం పెల్లుబికి, పండగలో ఎటువంటి మత విద్వేషాలు, సంఘర్షణలు, అల్లర్లు జరగకుండా రంజాన్ పండగ ప్రశాంతయుతంగా ముగిసినట్లు ఎస్‌పి తెలిపారు. రంజాన్ సందర్భంగా మత ఘర్షణలు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన ముందస్తు భద్రత చర్యలు సత్ఫలితాలిచ్చాయని పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని దష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీసు అధికారులు డ్రోన్స్ తో పర్యవేక్షించామన్నారు. మసీదుల వద్ద ప్రార్థనలకు విచ్చేసిన ముస్లిం సోదరులకు హిందూ సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యారెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు పర్యవేక్షించినట్లు తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

బొబ్బిలి : పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిములు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంజాన్ సందర్భంగా సోమవారం ముస్లిములు సామూహిక ప్రార్థనలు రంజాన్ పవిత్రతను ముస్లిం పెద్ద అబ్దుల్ కలాం వివరించారు. ముస్లిములకు ఎమ్మెల్యే బేబినాయన రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు.

బొబ్బిలిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

బ్యాడ్మింటన్ ఆడుతున్న చిన్నారులు

రసవత్తరంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉగాది, రంజాన్ సందర్భంగా ఆది, సోమవారాల్లో చిన్నారులకు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా, రసవత్తరంగా సాగాయి. సబ్ జూనియర్ విభాగంలో పి.దన్విర్, బి.మోక్షిత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో పి.నేహా, ఎల్.మౌనిష్ హనీష్ మొదటి మూడు స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో సిహెచ్.లేఖ్య, పి.జస్మిత విన్నర్, రన్నర్‌గా నిలిచారు. సీనియర్ విభాగంలో సింగిల్స్‌లో పి.భార్గవ్ సూర్య, సిహెచ్ సూరజ్ ప్రీతం, పి.లలిత్ ఫణి చంద్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. డబుల్స్‌లో పి.భార్గవ్ సూర్య, ఎన్.పాల్ సుధాకర్ ప్రథమ స్థానంలో, సిహెచ్ సూరజ్ ప్రీతం, జె.కుశాల్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి మంగళవారం బహుమతులు అందిస్తున్నట్లు చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు.

సర్వేలతో సతమతం

- సచివాలయ కార్యదర్శులపై పనిభారం
- ప్రజలకు అందని సేవలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పని ఒత్తిడితో సచివాలయ కార్యదర్శులు ఇక్కట్లకు గురవుతున్నారు. పేరుకు వార్డు సచివాలయ కార్యదర్శులైనా పని విషయంలో ప్రతి ఉద్యోగికి ఓ పరిధి అంటూ ఉంటుంది. కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఈ పని చేస్తే సరిపోతుంది అని కాకుండా.. అన్ని పనులు వారే చేయాల్సి వస్తోంది. ఈ పని, ఆ పని కాకుండా నగర పాలక సంస్థలో వరిధిలోని అన్ని రకాల పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత వీరిపైనే ఉంది. సర్వేల ఒత్తిడి వల్ల కార్యదర్శులు ప్రజలకు సేవలు అందించలేక పోతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం వరుస సర్వేలు చేపట్టడంతో కార్యదర్శులు సతమతమవుతున్నారు.

నగరంలో 60 సచివాలయాలు ఉన్నాయి. వాటర్ టాప్ కనెక్షన్ సర్వే, హౌస్ హోల్డు సర్వే, ప్రతి ఇంటి జియో టాగింగ్ సర్వే, ఎంఎస్‌ఎంఇ సర్వే, చిల్డ్రన్ వితౌట్ ఆధార్ సర్వే, పి 4సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వేతో పాటు పన్నుల వసూళ్లకు సచివాలయ కార్యదర్శులు వెళ్తున్నారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా పనులు వస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. అన్ని సర్వేలకు నియమిత కాల వ్యవధి నిర్ణయించడం ఉద్యోగులను ఒత్తిడికి చేస్తోంది. అన్ని శాఖల సర్వేలు ఒకేసారి కావడంతో తీవ్ర గందరగోళానికి గురికావాల్సి వస్తుందని కార్యదర్శులు వాపోతున్నారు. సర్వేలు ఎందుకు ఉపయోగపడతాయో ప్రజలకు వివరించలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఆయా సర్వేలు, పథకాల అమలు బాధ్యత కార్యదర్శులపై మోపడంతో రోజు రోజుకూ పని భారం పెరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమపై పని భారం తగ్గించాలని కార్యదర్శులు కోరుతున్నారు.

సర్వే చేస్తున్న సచివాలయ కార్యదర్శి

టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

రీమాపేటలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం రూరల్ మండలం రీమా పేట ఉమా మహేశ్వర్‌నగర్‌లో టిడిపి కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు చిల్లా సత్య నారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పార్టీని పటిష్టం చేయడానికి కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యకర్తలకు ఏ అవసరమొచ్చినా స్థానిక నాయకులను సంప్రదించాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయానికి అందరు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొద్దల నరసింగ రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై సర్వే

ప్రజాశక్తి-రామభద్రపురం

వంశపారంపర్య వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఆరికతోట పిహెచ్‌సి ఎఎన్‌ఎం మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో కలిసి సోమవారం సర్వే చేపట్టారు. వ్యాధులు, వాటి తీవ్రత, వాడుతున్న మందుల వివరాలు ప్రశ్నావళి రూపంలో అడిగి నమోదు చేస్తున్నారు. వీటిని ఆ కుటుంబానికి సంబంధించిన అందరి వ్యక్తులకు నమోదు చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డులు జారీ చేసేందుకు ఇదే సర్వే ద్వారా సమాచారాలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు జ్యోతి, స్రవంతి, చిన్నమ్మలు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో మదర్ థెరీసా సేవా సంఘం, మదర్ థెరీసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా సేవాసంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాదచారుల దాహార్తి తీర్చేందుకు తాగునీటితో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సాయికృష్ణ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న పెద్దలు జామి సూరిబాబు, కొల్లిసత్యం మాస్టారు తదితరులు పాల్గొన్నారు

నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారంతా తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వ్యవసాయ గిడ్డంగి

ప్రారంభానికి ముస్తాబు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట, రాయుడుపేట గ్రామాల మధ్య నిర్మించిన వ్యవసాయ గిడ్డంగి ప్రారంభానికి సిద్ధమైంది. రైతులకు ఉపయోగపడేలా వేపాడ పిఎసిఎస్ ఆధ్వర్యాన ఈ బహుళ ప్రయోజన సౌకర్య గోదాం నిర్మించారు. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు.

రోగికి రూ.35 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కందివలస గ్రామానికి చెందిన చెందిన కాకి గురుమూర్తి అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ తదితర సమస్యల వల్ల సుమారుగా మూడు లక్షల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. దీంతో దాతలను ఆశ్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న బొత్స లక్ష్మణరావు కుమారుడు బొత్స చైతన్య బాబు సోమవారం రోగి కుటుంబీకులకు రూ.35 వేలు నగదు సాయం అందించారు. దీంతో వారి కుటుంబీకులు చైతన్య బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రోగి కుటుంబీకులతో పాటు కందివలస జనసేన నేత నక్కన రమణ ఉన్నారు.

ఇంట్లో చిందరవందరగా ఉన్న బీరువాను పరిశీలిస్తున్న బాధితుడు కసవయ్య

వాజీ ఇంటర్నెట్ ప్రోటోకాల్ టీవీ నెట్‌వర్క్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సాంకేతిక పరిజ్ఞానంలో వాజీ ఛానల్ ఎల్లప్పుడూ ముందుండడం అభినందనీయమని ఎఆర్ఎఎస్‌పి జి. నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్లో వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి రవ్వా శ్రీనివాసరావు లతో కలిసి ఇంటర్నెట్ ప్రోటోకాల్ టివిని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. మహాశివరాత్రి రోజున నిర్వహించే హౌసీలో విజేతలైన వారికి ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వాజీఛానల్ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

మానవ హక్కులపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్టు మానవహక్కుల సంఘం నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు తెలిపారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 10 నుంచి ఈ కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, పథకాలు అందని వారిని గుర్తించి వారి సమస్యలను అధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెల్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మానవహక్కులకు భంగం కలిగితే వెంటనే ఫిర్యాదులు స్వీకరించి వారికి న్యాయం జరిగేంత వరకు తమసభ్యులు పోరాడతారని తెలిపారు. కార్యక్రమంలో మానవహక్కుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ అచ్చిరెడ్డి, ఎపి స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడినాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో ఆరికతోట గ్రామంలో ముస్లిములకు కూటమి నాయకులు సోమవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ముందుగా మసీదులో నమాజ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లా చంద్రరావు, నల్ల కూర్మారావు, సంగిరెడ్డి ప్రసాద్, బేత స్వామినాయుడు, జనసేన నేత అల్లు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అవయవదాతలకు మరణం లేదు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవయదాతల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే

అవయవ దాతలకు మరణం ఉండదని, మరణించిన తర్వాత అవయవాలను అగ్నికి ఆహుతి చేయడం కంటే, బ్రెయిన్ డెడ్ అయిన తర్వాత వారి అవయవాలను అవసరమైన వారికి దానం చేస్తే మరి కొంతమందికి ప్రాణం పోసిన వారు అవుతారని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవయవ దాతల తల్లిదండ్రుల అభినందన సభ సోమవారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాల రీత్యా ఎవరైనా మరణిస్తే వారి అవయవాలను దానం చేయడం వల్ల మరి కొంత మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. వెంకటరమణ ఆసుపత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు మాట్లాడుతూ అవయవదానాన్ని మించిన దానం లేదని, అవయవ దానం చేస్తే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, అఖిలభారత అవయవదాతల సంఘ వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అవయవ దానం చేసే వారికి ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం అవయవ దానం చేసిన పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేనా సాయి, గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గండి సాయి పల్లవి తల్లిదండ్రులను ఈ సందర్భంగా సత్కరించారు. జెవివి నాయకులు ఎరుకొండ ఆనంద్,షిణగం శివాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది, రంజాన్ సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాట్లాడుతున్న కార్పొరేటర్ కె.రాధామణి

గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్ సంబరాలు గాజులరేగ శాఖా గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎవి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు ఎన్.ఆదినారాయణ, కె.రాధామణి హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యాసరచన పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులను స్థానిక నారాయణ స్కూల్ నిర్వాహకులు ఎం.నారాయణరావు అందజేశారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన, కోలాటం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హిందూ మరియు ముస్లిం మతాలకు చెందిన ఇరువురు ప్రముఖులు ఎన్. రామానాయుడు, మహమ్మద్ హబీబ్‌లను సత్కరించారు. గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో లౌకికవాదాన్ని, సమ భావనను పెంపొందించే ఆశయంతో ఉగాది, రంజాన్ సంబరాలను కలిపి నిర్వహించినట్లు తెలిపారు. కార్పొరేటర్లు రాధామణి, ఆదినారాయణ మాట్లాడుతూ మంచి ఆశయంతో కూడిన ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా శ్రీమతి వి .చిన్నదేవి పాల్గొన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.లక్ష్మణరావు, ఖైరున్నీసా, వై.శ్రీనివాసరావు, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి- రేగిడి

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతన బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించాలని కోరుతూ ఏప్రిల్ 1 కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అందరూ పాల్గొనాలని కోరారు. కమిటీ సభ్యులు ఎం.త్రినాధ్ ఆధ్వర్యంలో కాగితాపల్లి గ్రామంలో చెరువు పనుల వద్దకు వెళ్లి సోమవారం కూలీలతో ప్రభుత్వం నుంచి రావలసిన వేతన బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 వారాలుగా ఉపాధి బిల్లులు చెల్లించలేదని, ఎండలు తీవ్రంగా ఉన్న రెండు పూటలా పనులు చేయిస్తున్నారని తెలిపారు. పారలు, గుణపాలు, తట్టలకు మంజూరు డబ్బులు చెల్లించకపోవడం విడ్డూరమన్నారు. పనుల వద్ద ఉపాధి కూలీలకు తాగునీరు, మజ్జిగ, టెంట్లు తదితర ఏర్పాట్లు కల్పించడం లేదని ఉపాధి కూలీల తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. పనిచేసిన 14 రోజుల్లోగా బిల్లులు చెల్లించాలని చట్టం చెబుతుంటే ప్రభుత్వం అధికార యంత్రాంగం నెలలు తరబడి బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. తక్షణమే బిల్లులు చెల్లించాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ఒక పూట పని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒక కుటుంబానికి రెండు వందల రోజులు పని, రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 1న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధి హామీ కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విద్యుత్తు పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

విద్యుత్తు పరికరాలు అందజేస్తున్న సన్యాసిరావు

చీపురుపల్లి పట్టణంలో ఉన్న సుమారు 20 దేవాలయాలకు కిల్లంశెట్టి సన్యాసిరావు(శ్రీను) కుటుంబ సభ్యులు 30 వేల రూపాయలు విలువ చేసే విద్యుత్ ఎల్ఇడి ట్యూబ్‌లైట్ల సెట్లు, ఎల్ఇడి బల్బులు సోమవారం పంపిణీ చేశారు. తన తల్లి దండ్రులైన కిల్లంశెట్టి వెంకటరామాంజనేయులు, లక్ష్మీకుమారి దంపతుల జ్ఞాపకార్ధం విద్యుత్ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక శెగిడి వీధిలో ఉన్న రామాలయానికి ఎల్ఇడి ట్యూబ్‌లైట్ల సెట్లుతో పాటు ఎల్ఇడి విద్యుత్ బల్బులను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. చీపురుపల్లిలో ఆలయాలన్నింటికి సుమారు 30 వేల రూపాయల విలువ చేసే విద్యుత్ పరికరాలను అందించనున్నట్లు సన్యాసిరావు తెలిపారు. ఈసందర్భంగా సన్యాసిరావుని పలువురు అబినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురపు రామన్, బుంగ కనకేశ్వరరావు, అడ్దూరి సీతబాబు, బలగ రామారావు, సూరు కుమార్, వలిరెడ్డి రవీంద్రనాయుడు, ఎస్‌విజి శ్రీనివాసరావు, సూరు వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చిందరవందరగా ఉన్న బీరువాను పరిశీలిస్తున్న బాధితుడు కసవయ్య

పేరాపురంలో చోరీ

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని పేరాపురంలో భారీ చోరీ జరిగింది. 4 తులాల బంగారం, 2 లక్షలు నగదు చోరీకి గురయినట్లు బాధితులు తెలిపారు. పేరాపురం గ్రామానికి చెందిన గురుగుబిల్లి కసవయ్య కుటుంబంతో కలిసి ఈనెల 26న తిరుపతి వెళ్లారు. 29 వతేదీ అర్ధరాత్రి తిరుపతి నుండి పేరాపురం ఇంటికి చేరుకున్నారు. తలుపులు తీసి వుండటంతో వెంటనే స్పందించిన బాధితులు ఇంటిలో చూడగా 4 తులాలు బంగారం, 25 తులాల వెండి, రూ.2.30 లక్షలు నగదును దొంగలు అపహరించినట్లు గుర్తించారు. 3 చైన్లు, 3 చిన్న ఉంగరాలు, 1 పెద్ద ఉంగరం, చిన్నిపిల్లల గాజులు రెండింటిని దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. పూసపాటిరేగ ఎస్ఐ ఐ. దుర్గాప్రసాద్‌కు జరిగిన సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు ఎవరైనా దొంగతనానికి పాల్పడ్డారా లేదా బయట వ్యక్తులు చోరీ చేసారా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

ఇద్దరు అరెస్టు

నెల్లిమర్ల: సీతారామునిపేట వద్ద బహిరంగంగా పేకాడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ బి. గణేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాల గురించి సమాచారాన్ని ఫోన్ ద్వారా గాని మెసేజ్ వాట్సాప్ ద్వారా గాని 9121109444కి ఇవ్వాలని ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఛత్రఘర్ నుంచి కన్యకుమారి వెళ్తున్న రైలు నుంచి జారిపడి పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. డిబ్రుఘర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న రైలు నుంచి బెంగాల్‌కు చెందిన ఛత్రి బాలు (46) విజయనగంలో తాగునీరు కోసం రైలు దిగాడు. మంచినీరు కొనుక్కొని రైలు ఎక్కుతుండగా జారిపోయి ప్లాట్‌ఫాంకు, రైలుకు మధ్య ఇరుక్కొని మృతి చెందారు. రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గెడ్డలో పడి గొర్రెల కాపరి మృత్యువాత

ప్రజాశక్తి - జామి

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వారాది అప్పల కృష్ణ (44) మృత దేహం సోమవారం జాగారం గెడ్డలో లభ్యమైన ఘటన కలకలం రేపింది. కృష్ణ ఆదివారం గ్రామంలోని ఓ మహిళ అంత్యక్రియలు కార్యక్రమంలో పాల్గొన్నాడు. తరువాత ఎప్పటిలాగే గొర్రెల కాపలాకు వెళ్ళిపోయినట్లు భావించిన కుటుంబ సభ్యులకు సోమవారం గెడ్డలో కృష్ణ శవం లభ్యం కావడం తో భార్య గౌరి తో పాటు గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అయితే భార్య గౌరి తన భర్త ప్రమాదపు శాత్తు మరణించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ ఐ వీరజానార్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గెడ్డలో ఉన్న అప్పలకృష్ణ మృతదేహం

వెంకటనాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ఎమ్మెల్యేను కలిసిన నర్సుపల్లి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయనను, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడును ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొబ్బిలి కోటలో బేబినాయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎఎంసి చైర్మన్‌గా ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమానికి పని చేస్తానని చెప్పారు. వెంకటనాయుడును బేబినాయన సత్కరించారు. బుడా కార్యాలయంలో చైర్మన్ లక్ష్మునాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ సంయుక్త కార్యదర్శిగా చిన్నయ్య

ప్రజాశక్తి-బాడంగి

వైసిపి ఎస్‌సి సెల్ సంయుక్త కార్యదర్శిగా రాజాన చిన్నయ్యను ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. బాడంగి మండలం రేజేరు గ్రామానికి చెందిన చిన్నయ్య వైసిపిలో చురుగ్గా పని చేస్తున్నారు. మొదటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. గతంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎఎస్ఐ పేరిట సైబర్ మోసం

ప్రజాశక్తి - సంతకవిటి

సైబర్ నేరాలుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్ గోపాలరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంతకవిటి ఎఎస్ఐ పేరుతో రూ.97 వేలు నగదును గుర్తు తెలియని దుండగలు దోచేశారన్నారు. సైబర్ నేరగాళ్ల సంతకవిటి పోలీస్ స్టేషన్ నూతన ఎఎస్ఐ అని చెప్పి పొట్నూరు శ్రీనివాసరావుకు ఫోన్ చేశారు. ఎస్ఐ కుమారుడుకు అనారోగ్య కారణంగా కొంత డబ్బు అవసరమైందని కాల్ చేశామని తెలిపారు. అర్జెంటుగా ఫోన్ పే చేయాలని కోరగా, శ్రీనివాసరావుతోపాటు మరో ఇద్దరు వద్ద నుండి 97వేల రూపాయలు ఫోన్‌పై చేయించుకున్నారు. మీ డబ్బును తిరిగి మా కానిస్టేబుల్‌తో పంపిస్తామన్నారు. వెంటనే సైబర్ నేరగాళ్ళు క్షణాల్లో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. అనంతరం బాధితుడు శ్రీనివాసరావు సంతకవిటి స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని, ఎవరైనా తెలియని వ్యక్తులు మీ ఫోన్ అడిగితే ఇవ్వొద్దన్నారు. మీ ఫోన్‌కు ఒటిపి పంపించన వాళ్ళే, మీ అకౌంట్‌లో ఉన్న డబ్బులు మాయం చేస్తారని తెలిపారు

ఆవుదూడల ప్రదర్శను తిలకిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఆకట్టుకున్న దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని మార్లపల్లిలో సోమవారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆడదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. 78 రైతులకు చెందిన 90 దూడలు ప్రదర్శనలు పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సందర్శించారు. ఆరోగ్యంగా ఉన్న మూడు దూడలను ఎంపిక చేసి, వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశువైద్యాధికారులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి వైవి రమణ, ఎడి గంగాధర్ రావు, లక్కవరపుకోట పశువైద్యాధికారి గాయత్రి, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మార్లపల్లి సర్పంచ్ గోకాడ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బోల్తాపడిన లారీ

అదుపు తప్పి ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం నీళ్ల ట్యాంకు సమీపంలో సోమవారం సాయంత్రం ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లినర్ లకు స్వల్ప గాయాలయ్యాయి. గజపతినగరం వైపు నుంచి నగరంలోకి వస్తున్న లారీ నీళ్ల ట్యాంక్ మలువు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని కె.ముంగనాపల్లి సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ముందస్తు సమాచారంతో పూసపాటిరేగ ఎస్ఐ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ టీమ్ పేకాటశిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.7059 నగదు ఏడు సెల్ ఫోన్లు, ఒక కారు రెండు మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడి గ్రామ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఆర్‌టిసి బస్సు ఢీకొని పాలకొండ మండలం పొట్లి గ్రామానికి చెందిన మీసాల తిరుపతిరావు (38) మృతి చెందినట్లు ఎస్ఐ కళాధం తెలిపారు. వీరఘట్టం నుండి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించిందన్నారు.